క్లుప్తంగా

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్‌ఐ

కౌతాళం: ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పోలింగ్ బూత్‌లు, పరిసరాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు 9మంది ఉన్నారని అలాగే మండలంలో పట్టభద్రులు 744 మంది ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వంద అడుగుల దూరంలో తమ వాహనాలను నిలిపి లోపలికి రావాలని ఉదయం 8 నుంచి 4గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఏదైన గుర్తింపు కార్డును తీసుకు రావాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించాలని కోరారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ కృష్ణయ్య, ఏఈ వెంకటేశ్వర్లు

కోసిగి: మండల కేంద్రం శివారులోని భూగేని చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మారుస్తున్న పనులను శనివారం ఇరిగేషన్ డీఈ కృష్ణయ్య, ఏఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. రూ.37లక్షలతో చేపడుతున్న పనుల్లో ప్రస్తుతం చెరువులో ముళ్ల పొదలు తొలగించి పూడిక తీత, బెడ్డింగ్, కరకట్ట పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పులికనుమ రిజర్వాయర్ నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు పైప్‌లైన్ వేయించి నీటిని పంపింగ్ చేస్తామని చెప్పారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న ఎల్లెల్సీ గట్లు


ఎల్లెల్సీ గట్టుపై వేసిన కోడి వ్యర్థాలు, జంతువుల కళేబరాలు

హొళగుంద: బళ్లారి రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) గట్లు, పరిసరాలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. దీంతో నీరు కలుషితమై ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని గ్రామస్తులు వాపోతున్నారు. చికెన్ షాపు నిర్వాహకులు కొందరు కోళ్ల వ్యర్థాలను కాలువ గట్టుపై వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పందులు, కుక్కల కళేబరాలను తెచ్చి కాలువ గట్టున వేస్తున్నారు. ఫలితంగా నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. ఇటీవల పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ పారిశుద్ధ్య పనులు చేయించారు. వ్యర్థాలను చెత్త సేకరణ కేంద్రంలో వేయాలని, కాలువ గట్టుపై పడేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా వారిలో మార్పు లేదు

భక్తితో పులకించిన పులిచెర్ల

కృష్ణగిరి: విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలతో మండల పరిధిలోని పులిచెర్ల గ్రామం భక్తితో పులకించింది. శనివారం ఉదయం నూతనంగా నిర్మించిన శివాలయంలో వినాయకుడు, శివలింగాన్ని, శిఖర, నంది విగ్రహ ప్రతిష్ఠలతో పాటు నూతనంగా నిర్మించిన ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఇంటి ఆడబిడ్డలకు ఒడి బియ్యం పోశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అశ్వ వాహనంపై ఊరేగిన శ్రీవారు


అశ్వవాహనంపై కొలువైనస్వామి వారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన రంగనాథుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరంగనాథుడు సతీసమేతుడై శనివారం అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల మధ్య పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేదమంత్రాలు చదువుతూ పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని అశ్వ వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

నేడు లాల్‌మాన్‌పల్లెలో ఇస్తెమా

కృష్ణగిరి: మండలంలోని లాల్‌మాన్‌పల్లె గ్రామంలో ఆదివారం ఇస్తెమా నిర్వహించనున్నట్లు ముస్లిం మత పెద్దలు మైదాన్, కాలెసాహెబ్, మదార్‌సాహెబ్, అల్లీసాహెబ్ శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ముస్లింలు హాజరు కావాలని కోరారు.

తల్లీబిడ్డకు సంపూర్ణ పోషణ

- అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం
- ప్రతి నెల 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' కిట్ పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న గర్భిణులు, బాలింతలు

ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం నడుం బిగించింది. ముఖ్యంగా తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం ముఖ్యం. పేదలు కూడా పౌష్టికాహారం తీసుకునేలా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు వయస్సున్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం మెనూ ప్రకారం వండి వడ్డించేలా చర్యలు చేపట్టింది. అలాగే వివిధ రకాల పదార్థాలతో పోషణ కిట్ అందజేయడమే కాకుండా నెలకోసారి వైద్య పరీక్షలు చేయించి వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తోంది.


అంగన్ వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు,బాలింతలు



లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందజేస్తున్న దృశ్యం

కోసిగి: పుట్టబోయే బిడ్డ, తల్లి ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ రోజు వారిగా మెనూ ప్రకారం పౌష్టికాహారం వండి వడ్డిస్తున్నారు. మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా..1,236 మంది గర్భిణులు, 1,034 బాలింతలు, 0–6 ఏళ్ల లోపు చిన్నారులు 6,757 మంది ఉన్నారు. వీరికి మెనూ ప్రకారం రోజూ మధ్యాహ్న భోజనంలో అన్నం, ఆకు కూర, కూరగాయాలతో పప్పు, కోడి గుడ్డు, 200 మి.లీ. పాలు అందజేస్తున్నారు. పిల్లలకు అన్నం, పప్పు, కోడి గుడ్డుతో పాటు 100 మి.లీ. పాలు ఇస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ ..

గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజనంతో పాటు ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందిస్తున్నారు. ఇందులో ఒక కేజీ రాగి పిండి, కేజీ జొన్న పిండి, కేజీ అటుకులు, 250గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశెనగ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరాలు ఉంటాయి. ఈ కిట్‌ను నెలకోసారి అందజేస్తారు.

కేంద్రాల్లో వైద్య సేవలు..

గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలో నెలకొకసారి ఏఎన్ఎం, అశా వర్కర్ల, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో వైద్య సేవలు అందిస్తున్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆగర్యోవంతంగా పౌష్టికాహారం అందజేస్తుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం బాగుంది



అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం బాగుంటోంది. అన్నం, ఆకు కూర పప్పు, కూరగాయ కర్రీతో పాటు కోడి గుడ్డు, 200మి.లీ. పాలు ఇస్తున్నారు. చాలా సంతృప్తికరంగా ఉంది. రోజూ ఇలా తినడం పేదలకు సాధ్యపడదు కదా. మాలాంటి వారికోసం ఇలాంటి ఆహారం అందజేసి తల్లీ,బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా చూడటం అభినందనీయం. – తలారి రాజేశ్వరి, కోసిగి

మెనూ ప్రకారం వడ్డిస్తున్నాం



గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలోనే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డిస్తున్నాం. కాన్పు అయి 6నెల లోపు వారికి ఇంటి వద్దకే భోజనం పంపుతున్నాం. అలాగే నెలకోసారి ప్రభుత్వం అందజేసే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందజేస్తున్నాం. – హెప్సిబా రాణి, అంగన్‌వాడీ కార్యకర్త

సంపూర్ణ పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తోంది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మోనూ ప్రకారం వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నాం. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే వారు సంపూర్ణ పోషణ కిట్‌ను సద్వినియోగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. ఆహారంతో పాటు నెలవారీగా వైద్యపరీక్షలు చేయించి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నాం. – సుధావతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం:మండలంలోని అంజనేయస్వామి ఆలయాలు భక్తులతో సందడి నెలకున్నాయి. మండలంలోని సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి, అగసలదిన్నెలోని దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు వందలాదిగా తరలివచ్చి దర్శించుకున్నారు.తెల్లవారుజామున 5గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. బుడుములదొడ్డిలో సీతారాములకు పూజల అనంతరం ఉత్సవమూర్తులకు రథోత్సవం జరిపించారు. మండల కేంద్రంలోని కూడా పూజలు జరిగాయి.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో విద్యార్థుల ఎంపిక

ఆదోని రూరల్ : భీమా ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకి చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ వారు శనివారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు తెలిపారు. దివ్యశ్రీ,సనాకొసర్, సంజయ్, ఆఫ్రీన్, రేఖ, సాయికృష్ణ, యమున, ప్రజ్ఞ,విశ్వనాథ్, వన్నూరు స్వామి, మంజునాథ్ ఉద్యోగాలు సాధించారని చెప్పారు.

అధిక మార్కులు సాధించి పేరు తీసుకురావాలి

వెల్దుర్తి: అధిక మార్కులు సాధించి స్కూల్‌కు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన విద్యార్థులకు సూచించారు. త్వరలో 10వ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురుకుల విద్యాలయంలో 'తల్లిదండ్రుల దీవెనలు' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులు హాజరై తమ పిల్లలను దీవించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటి వాతావరణం, తల్లితండ్రుల దీవెనలే విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్నిస్తాయన్నారు.

పాదయాత్ర..భక్తి పారవశ్యం


భజన పాటలతో బయలుదేరిన భక్తులు


కర్రలు కట్టుకుని పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కోసిగి: ఉగాది సందర్భంగా భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరారు. శనివారం వేకువజామునే వందలాది మంది కాలినడక వెళ్లారు. కర్ణాటక రాష్ట్రంలో బాగల్ కోట్, శిరివార్, కొప్పల్, గదగ్, దార్వాడ, సింధనూరు, శిరుగుప్ప తదితర ప్రాంతాల నుంచి తరలి వెళ్తున్నారు. కొందరు యువకులు మొక్కు చెల్లింపులో భాగంగా కాళ్లకు రెండు నుంచి మూడు అడుగుల మేర కర్రలు కట్టుకుని ఇతరుల సహకారంతో కాలినడక సాగిస్తున్నారు. మరి కొందరు పల్లకీలో స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను ఉంచి భజన పాటలు ఆలపిస్తూ సాగుతున్నారు. కాగా భక్తులకు ఇబ్బందులు లేకుండా మండలంలోని ఆర్లబండ, కొల్మాన్‌పేట, దుద్ది, కోసిగి, చైతన్య స్కూల్, రంగప్ప గట్టు, డి.బెళగల్ గ్రామాల వద్ద భోజన వసతి ఏర్పాటు చేశారు. పలుచోట్ల చల్లని మజ్జిగ, చలివేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పూర్తి చేయండి


అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్‌లకు, ఎన్నికల అధికారులకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం, లైట్లు, ఫ్యాన్, టేబుల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అధికారులు, ఓటర్లు ఎన్నికల నియామవళిని పాటించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఆర్ఐ జయరామ్‌రెడ్డి, వీఆర్వోలు రాజశేఖర్‌గౌడ్, హనుమంతరావు ఉన్నారు.

14న 'ఇమాం ఏ ఆజం అబూ హనీఫా'

- సర్వమానవాళి శాంతి కోసం కాన్ఫరెన్స్‌లు


మాట్లాడుతున్న సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ

కర్నూలు(రాజ్‌విహార్): ఇమాం ఏ ఆజం అబూ హనీఫా రజిఅల్లాహు అన్హు జీవిత చరిత్రపై ఈ నెల 14వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ అన్నారు. శనివారం స్థానిక పాతబస్తీలోని ఆ సంఘం కార్యాలయం మిలాద్ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వమానవాళిని శాంతి వైపు నడిపేందుకు కాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అహలే సున్నతుల్ జమాత్, సెంట్రల్ ఈద్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 7గంటలకు (మగ్రీబ్ నమాజు తరువాత) బుధవారపేట బ్రిడ్జి వద్ద ఉన్న ఎంఎస్ ఫంక్షన్ హాలులో గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జామియా నిజామియా నక్షబంది, ఖతీబే హిందుస్తాన్ అల్లమా మౌలానా మొహమ్మద్ అహ్మద్, ప్రముఖ మత గురువు మౌలానా ఆసిఫుద్దీన్ ఖాద్రీ హాజరై ప్రసంగించనున్నారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఈ సభకు హాజరై ఆధ్యాత్మికతను పెంపొందించుకొని అల్లాహ్ మార్గంలో నడుచుకోవాలని కోరారు. సమావేశంలో రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా ఖాద్రీ, అహలే సున్నతుల్ జమాత్ కమిటీ ప్రతినిధి సయ్యద్ మాసుం పీర్ ఖాద్రీ, మహబూబ్ బాషా, మొహమ్మద్ జుబేర్ ఖాద్రీ, నజీర్ ఖాద్రీ పాల్గొన్నారు.

కారు–ఆటో ఢీ

– భార్యాభర్తలకు గాయాలు


చికిత్స పొందుతున్న షేక్షావలి

ఎమ్మిగనూరు రూరల్: పట్టణ సమీపంలో అగ్నిమాపక కేంద్రం సమీపంలో శనివారం ఆటో–కారు ఢీకొనటంతో భార్యభర్తలకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు... ఆదోనికి చెందిన షేక్షావలి, మాబీ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి సొంత ఆటోలో కలుగొట్లకు బయలుదేరారు. ఎమ్మిగనూరు సమీపంలోకి రాగానే ఆటో ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో షేక్షావలికి కాలు విరిగింది. మాబీకి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు సహకరించండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వీరశైవ సంఘం నాయకులు

ఆదోనిటౌన్ : పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు సమీపంలోని బాటమారెమ్మవ్వ గుడి వద్ద శ్రీ బసవేశ్వరుడి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని వీరశైవ సమాజసేవా సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం రాత్రి ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు వివిధ శాఖల అనుమతులు ఇప్పించాలని కోరగా.. ఎమ్మెల్యే స్పందిస్తూ అనుమతులిప్పించేదుకు సహకరిస్తానని, విగ్రహ ఏర్పాటుతో ఆకర్షణీయంగా ఉంటుందని చెప్పారు. మే 6,7,8 తేదీలు ప్రతిష్ఠకు అనువుగా ఉంటాయని చెప్పగా.. ఈ లోపు అనుమతులు వచ్చేలా చూస్తానని హామీనిచ్చారు.

ప్రయాణం.. ఇక సులభం


నాడు అధ్వానంగా ఉన్న కోగిలతోట రోడ్డు


నేడు కొత్త రూపు..

హొళగుంద: మండల కేంద్రానికి మారుమూలన ఉండి నాడు మరమ్మతుకు నోచుకోక అధ్వాన్నంగా ఉన్న కోగిలతోట రోడ్డు నేడు రూపు రేఖలు మారిపోయాయి. అడుగడుగునా గతుకులు, గుంతలతో ఉన్న కోగిలతోట 5 కి.మీ ఆర్అండ్‌బీ రోడ్డును బ్యాంక్ గ్యారెంటీ లోన్ రూ.1.85 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. తారు రోడ్డు పనులు వేగంగా జరుగుతూ ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నెల 17న కోగిలతోట గ్రామంలో సుంకలమ్మ, మారెమ్మ దేవిల మేటి కుంభోత్సవం ఉంది. అంతలోపు పనులు పూర్తవుతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదవాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ విధులకు హాజరయ్యే అధికారులకు శనివారం ఉద్యాన్‌భవన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల మాన్యువల్‌ను చదివి అర్థం చేసుకొని కౌంటింగ్ చేపట్టాలన్నారు. అప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కౌంటింగ్‌లో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాలన్నారు. తర్వాత బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కట్టి పోలింగ్ స్టేషన్ల వారీగా డ్రమ్ము ఇన్‌చార్జ్‌కి అప్పగించాలన్నారు. అనంతరం అభ్యర్థుల వారీగా ఓట్లను లెక్కించాలన్నారు. కాగా మాస్టర్ ట్రైన్, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి 14వ తేదీన మరోసారి శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కృష్ణగిరి: తమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని మండల పరిధిలోని కటారుకొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందురెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినులను పీఈటీ రామన్నతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 17, 18, 19 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 7వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థినులు శ్రావణిసంధ్య, పూజిత జిల్లా తరపున పాల్గొననున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, ఉషారాణి, మారుతి ప్రియ, వెంకటరాముడు, నరేష్, ప్రసాద్, అయ్యన్న, మురళీకృష్ణ, బాలపుల్లయ్య, వెంకటరమణ, సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.


నాటి ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ'కలయిక

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారందరూ శనివారం కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల మైదానంలో అందరూ కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గణితశాస్త్రం ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, పీఈటీ ఇస్మాయిల్‌ను దుర్గారమణ కల్యాణ మండపంలో సన్మానించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 23 సంవత్సరాల తర్వాత అందరూ కలిసి గురువులకు సన్మానించడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన భీమేష్ ఆచారి

మంత్రాలయం రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మాధవరం గ్రామంలో చోటు చేసుకుంది. మాధవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయం గ్రామానికి చెందిన భీమేష్ బైక్‌పై గిల్కేసూగూరు నుంచి మంత్రాలయం వైపు వస్తుండగా.. మంత్రాలయం నుంచి రాయచూరుకు వెళ్తున్న కారును మాధవరం గ్రామ శివారులో మొదటి కల్వర్టు వద్ద ఢీ కొట్టాడు. దీంతో భీమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 ద్వారా ఎమ్మిగనూరుకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

భజన పోటీల విజేత కర్నూలు


మొదటి బహుమతి అందుకుంటున్న కర్నూలు భజన బృందం సభ్యులు

కృష్ణగిరి: మండల పరిధిలోని మన్నెకుంట గ్రామంలో సుంకులాపరమేశ్వరి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో కర్నూలుకు చెందిన శివ పంచాక్షరి భజన బృందం విజేతగా నిలిచింది. 14 భజనబృందాలు పాల్గొనగా కర్నూలు బృందం మొదటి స్థానంలో నిలిచి అర తులం బంగారం కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో వీరారెడ్డిపల్లె శ్రీరామ భజన బృందం నిలిచి 25 తులాల వెండిని దక్కించుకుంది. ఆ తరువాత స్థానాల్లో వరుసగా కడిమెట్ల, కందికాయపల్లె, అల్లీనగరం, పుల్లగుమ్మి, వేల్పమడుగు, కడమకుంట్ల, నాయకల్లు, గుత్తి ఆర్ఎస్ బృందాలు నిలిచి రూ.14 వేలు, రూ.10,500, రూ.8,400, రూ.7,700, రూ.7వేలు, రూ. 6,300, రూ.5,600, రూ.3,500 చొప్పున గ్రామ చెన్నకేశవ భజన బృందం సభ్యులు, గ్రామస్తులు అందజేశారు.